

నేటి నుంచి విద్యాసంస్థలు పున : ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం



జిల్లాలో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు బుధవారం నుంచి పున:ప్రారంభం కానున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గత శనివారం నుంచి విద్యాసంస్థలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో విద్యార్థులు, చిన్నారులు శనివారం నుంచి మంగళవారం వరకూ ఇంటికే పరిమితమయ్యారు. అయితే వర్షాలు తగ్గుముఖం పట్టి వాతావరణ పరిస్థితులు కుదుట పడటంతో బుధవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి.

ఓపికి.. ఓటిపి కష్టం..!



ఓటిపి కోసం క్యూలైన్లలో ఉన్న రోగులు

- ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల అవస్థలు
- 'అబా' విధానంతో ముప్పతిప్పలు.. గంటలు తరబడి క్యూలో
- ఫోన్లు పనిచేయక, వృద్ధులకు ఫోన్లు లేక అవస్థలు
- ఆధార్ కార్డుతో ఓపి ఇవ్వాలని రోగులు వేడుకోలు
- ఎంఆర్ఐ స్కానింగ్‌కు పది రోజులపైనే
- గర్భిణులకు టిఫా స్కానింగ్ కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల అవస్థలు చెప్పలేని విధంగా మారాయి. సాంకేతికత పెరిగితే మరింత సులువుగా సేవలు మారాలి. అయితే ఓపి (అవుట్ పేషెంట్) చీటీ కావాలంటే ఓటిపి ఉండాల్సిందేనంటూ ప్రభుత్వం తెచ్చిన అబా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) విధానం రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఓటిపి కోసం రోగులు గంటల తరబడి క్యూలో వేచిచూడాలి. ఫోన్లు లేని వృద్ధులు, ఆసుపత్రిలో ఫోన్ సిగ్నళ్లు సరిగా రాక ఓటిపి రాకపోవడంతో రోగులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఆధార్ కార్డు నెంబర్‌తో ఓపి ఇచ్చే విధానం ఉంటే సరిపోతుందని, ఓటిపి విధానంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రోగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజు 1200 మంది రోగులు వస్తుంటారు. గతంలో ఓపి విభాగంలో చీటి తీసుకుని డాక్టర్ వద్ద చూపించుకునేవారు. కొత్తగా తీసుకొచ్చిన 'అబా' విధానంలో తొలుత ఆధార్‌కార్డులతోపాటు మన వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆధార్‌తో లింకైన ఫోన్ నెంబర్ ఇవ్వాలి. వివరాలు నమోదు చేసిన తర్వాత ఫోన్‌కు ఓటిపి వస్తుంది. ఆ నెంబర్ చెబితే ఓపి విభాగంలో చీటి ఇస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి కనీసం గంట నుంచి రెండు గంటలు పడుతోంది. దీంతో రోగులు అక్కడ నీరసంతో పడిపోతున్నారు. వృద్ధుల పరిస్థితి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. టెక్నాలజీ పెరిగితే పని మరింత సులభతరం కావాలిగాని, ఇలా గంటలు తరబడి వేచిచూడటం ఏమిటని అక్కడి సిబ్బందిపై రోగులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఆధార్ నెంబర్‌తో ఓపి చీటీ ఇచ్చేలా మార్పులు చేయాలని కోరుతున్నారు.

ఎంఆర్ఐ స్కానింగ్‌కు పది రోజులుపైనే..

గర్భిణులకు టిఫా స్కానింగ్ బయటే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మినహా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా ఎంఆర్ఐ, సిటీస్కానింగ్ సదుపాయం లేదు. ఏలూరు ఆసుపత్రిలో ప్రతిరోజూ 30 నుంచి 35 ఎంఆర్ఐ స్కానింగ్‌లు, 50 నుంచి 60 సిటీ స్కానింగ్‌లు మాత్రమే చేయగలుగుతున్నారు. ప్రతిరోజూ 1200 మంది అవుట్ పేషెంట్లు, 350 మందికిపైగా ఇన్‌పేషెంట్లు ఇక్కడ సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ఎంఆర్ఐ, సిటీస్కానింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే అందుకు తగిన ఏర్పాట్లు ఆసుపత్రిలో లేవు. దీంతో ఎంఆర్ఐ స్కానింగ్ చేయాలంటే పది నుంచి 15 రోజుల సమయం పడుతోంది. దీంతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోగనిర్ధారణ కాకుండా సరైన మందులు డాక్టర్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో రోగంతో రోజులు తరబడి బాధపడాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే ఎంఆర్ఐ స్కానింగ్ ఇప్పుడు దాదాపు రెండు వారాలు ఎందుకు పడుతుందో అర్థం కావడం లేదని రోగులు మాట్లాడుకుంటున్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ సమస్యలను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు. గర్భిణులకు చేసే టిఫా స్కానింగ్ సర్వజన ఆసుపత్రిలో లేకుండాపోయింది. ప్రతిరోజూ ఇక్కడ వంద మంది గర్భిణులు పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్నారు. బిడ్డ పరిస్థితి తెలుసుకునేందుకు 18 నుంచి 22 వారాల్లో సమయంలో టిఫా స్కానింగ్ చేస్తారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఈ స్కానింగ్ లేకుండాపోయింది. దీంతో డాక్టర్లు బయటికి రాస్తున్నారు. దీంతో గర్భిణులు రూ.1300 వరకూ చెల్లించి టిఫా స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో పేద కుటుంబాలకు చెందిన గర్భిణులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిఫా స్కానింగ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

రోగులు కూర్చునేందుకు బెంచీలు కరువు

రోజుకు 1200 మంది రోగులు వస్తున్న చోట కూర్చునేందుకు బెంచీలు కూడా సరిగా లేని పరిస్థితి ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నెలకొంది. ఐదో నెంబర్ నుంచి పదో నెంబర్ వరకూ ఒకే వరుసలో డాక్టర్లు అవుట్ పేషెంట్లను పరీక్షిస్తారు. ఒక్కో డాక్టర్ వద్ద పెద్దఎత్తున రోగులు ఉంటారు. రోగులు చూపించుకునే గది బయట కేవలం ఆరుగురు కూర్చునేందుకు రెండు బల్లలు మాత్రమే ఉంటున్నాయి. దీంతో రోగులు డాక్టర్‌ను కలిసేవరకూ నిలబడే ఉండాల్సి వస్తోంది. తీవ్ర జ్వరం, ఇతర రోగాలతో బాధపడేవారు గంటలు తరబడి నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల కోసం వెయిటింగ్ హాలు నిర్మించినా అక్కడ సైతం రెండు బల్లలు మాత్రమే వేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల అవస్థలు గురించి పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఆసుపత్రి ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయి బురదమయంగా తయారైనా పట్టించుకునే పరిస్థితి లేదు. రాత్రిపూట దోమలు విపరీతంగా ఉంటున్నాయంటూ రోగుల వద్ద ఉంటున్న కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సర్వజన ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



ఓటిపి విధానంతో నరకం చూస్తున్నాం

హరి, ఏలూరు

గతంలో కొనసాగిన ఓపి విధానం చాలా బాగుండేది. ఇప్పుడు ఓటిపి విధానం తేవడంతో గంటలు తరబడి నిల్చుంటే తప్ప పని పూర్తి కావడం లేదు. ఓటిపి చెబితే తప్ప ఓపి చీటీ ఇవ్వడం లేదు. నరాల సంబంధిత వ్యాధితో న్యూరో డాక్టర్‌ను కలవడానికి ఉదయం వచ్చాను. ఇప్పటి వరకూ ఓపి చీటీ తీసుకోలేదు. కొత్తవిధానం తెస్తే రోగులకు త్వరగా సేవలందాలే తప్ప ఇదేం పరిస్థితో అర్థం కావడం లేదు.ఆధార్ కార్డు చూపిస్తే ఓపి చీటీ ఇచ్చే విధానం తీసుకురావాలి.

ఎన్నిసార్లు వచ్చినా ఓటిపి ఉండాలంట..

రాముడు, మాదేపల్లి

గత నెల 14న వెన్నుపూస సమస్యతో వచ్చి చూపించుకున్నాను. అప్పుడు ఓటిపి అంటూ తీవ్ర ఇబ్బందులు పెట్టారు. ఇప్పుడు రెండోసారి చూపించుకోవడానికి వస్తే మళ్లీ ఓటిపి ఉండాలంటున్నారు. ఈ విధానంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యంతో గంటలు తరబడి నిలబడలేకపోతున్నాం. ఈ విధానం తీసేసి పాతవిధానం తీసుకురావాలి.





కోడేరు వద్ద పెరుగుతున్న వశిష్ట గోదావరి

క్రమేపీ పెరుగుతున్న గోదావరి వరద


ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి మళ్లీ వరద వస్తోంది. ఎగువ నుంచి పెద్దఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో మంగళవారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద గత 24 గంటల్లో రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరద పెరుగుదల ఇలానే కొనసాగితే రెండు, మూడు రోజుల్లో లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఓటర్ ఎనరోల్‌మెంట్ గడువు పొడిగించాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు రామభద్రం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ ఎనరోల్‌మెంట్ గడువును పొడిగించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి ఎన్ . వి జ య ం రా మ ం రా జు, ఎకెవి.రామభద్రం డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్ ఎనరోల్‌మెంట్ గడువు ముగిసిందని తెలిపారు. అయితే గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం, పాఠశాలలకు ప్రభుత్వం సెలవులను ప్రకటించిందని గుర్తు చేశారు. దీంతో అనేకమంది ఉపాధ్యాయులు తమ ఓటరు నమోదు దరఖాస్తులను రెవెన్యూ కార్యాలయంలో సమర్పించలేకపోయారని పేర్కొన్నారు. కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్లు కూడా వారి ఓటు కోసం దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ గడువును పొడిగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా

ప్రజాశక్తి - పెనుమంట్ర



పెనుమంట్ర : ఆందోళన చేస్తున్న ఆశాలు



భీమవరం టౌన్ : ఆందోళన చేస్తున్న ఆశాలు

ఆశా వర్కర్ల ఒప్పందం జిఒను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని, కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలమూరు పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్ల రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, ఆలమూరు పిహెచ్‌సి ఆశా వర్కర్లు డి.లక్ష్మి, పి.తులసీదుర్గ, పి.మంగ పాల్గొన్నారు.

మొగల్తూరు : ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులో పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్లు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒప్పంద జిఒను వెంటనే అమలు చేయాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన ఆశా వర్కర్ల రిటైర్మెంట్ జిఒ విడుదలయ్యే వరకూ వారిని కొనసాగించాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి పిహెచ్‌ఎన్ సావిత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో పి.బేబీకుమారి, ఎం.సరోజినీ, పి.రేవతి, సత్యవతి, దుర్గా, విజయలక్ష్మి పాల్గొన్నారు

భీమవరం టౌన్ : కలకత్తా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మంగళవారం ఆశా డే సందర్భంగా తుందుర్రు పిహెచ్‌లో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీల జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తుందుర్రు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ దయామణి పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు విమల కుమారి, ఎఎన్ఎం.రత్నకుమారి ఎంవి సుందరి, పి.ఉషాకుమారి పాల్గొన్నారు.

రస్కులు, బన్నులు విజయవాడ తరలింపు



ఆహార పొట్లాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

రెండు రోజుల్లో 1,98,960 ఆహార పొట్లాలు, 70 వేల వాటర్, 1.15 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, కలెక్టర్ నాగరాణి



ఆకివీడు :ఆహార పొట్లాలు వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడ వరద బాధితులకు ప్రభుత్వ సూచనల మేరకు పశ్చిమగోదావరి జిల్లా నుండి పెద్దఎత్తున వరద సహాయాన్ని పంపినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రెండు రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యల్లో భాగంగా జిల్లా నుండి 1,98,960 ఆహార పొట్లాలు, 70 వేల వాటర్ ప్యాకెట్లు, ఐదు వేల అరలీటర్ వాటర్ బాటిల్స్, 1,15,100 బిస్కెట్ ప్యాకెట్లు, 14 వేల బన్స్, 22 వేల రస్కులు వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, అసోసియేషన్స్, విద్యాసంస్థలు, ఇండస్ట్రీస్, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు, తదితరులు సహకారంతో విజయవాడకు ప్రత్యేక వాహనాల్లో పంపినట్లు చెప్పారు.

విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద బాధితులను ఆదుకునే సహాయక చర్యల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. వరద సహాయక చర్యల్లో భాగంగా రెండో రోజు వేలాది ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్, బన్నులు, మందులు, బిస్కెట్ ప్యాకెట్లు విజయవాడకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. కలెక్టర్ నాగరాణి ఆహార పదార్థాల తయారీని పరిశీలించి రుచి చూసి పలు సూచనలు చేశారు. విష్ణు, బివి.రాజు విద్యాసంస్థల నుంచి నాలుగు వేల ఆహార పొట్లాలు, లయన్స్ క్లబ్ తరపున మూడు వేల ఆహార పొట్లాలు, కలెక్టరేట్ క్యాంటీన్లో 500 ఆహార పొట్లాలను సిద్ధం చేశారు. భీమవరం శ్రీసత్య సాయి సేవాసమితి రాయప్రోలు చలపతి బృందం ఐదు వేల బిస్కెట్ ప్యాకెట్లు, రస్కులు, తణుకు సత్యసాయి సేవా సమితి ఐదు వేల వాటర్ ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, కాళ్ల ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున, డిపిఒ కె.విక్టర్, కార్యక్రమంలో డైరెక్టర్ (అడ్మిన్) జె.ప్రసాద రాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.రమేష్‌రాజు, ఫార్మసీ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాఘవరాజు, కళాశాల సిబ్బంది, సహాయ క్లబ్, రాక్ మీ ఫ్యాబ్ క్లబ్ లాంటి వివిధ స్టూడెంట్స్ క్లబ్స్, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు, రాయప్రోలు చలపతి, గోపిశెట్టి మురళీ, నందమూరి రాజేష్, లయన్స్ క్లబ్ సిహెచ్.కృష్ణంరాజు, నడింపల్లి మహేష్‌కుమార్, పేరిచర్ల మూర్తిరాజు, గోపిశెట్టి మురళీకృష్ణరావు, బండ కుమార్, వెంకటరత్నం, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ సారథ్యంలో విజయవాడ వరద బాధితులకు 15 వేల ఆహార ప్యాకెట్లను మంగళవారం పంపించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపల్ మహ్మద్ ఇస్మాయిల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ వారి స్వాభిమాన్ ఫౌండేషన్ ద్వారా ఆహార పొట్లాలను, వాటర్ బాటిళ్లను వ్యాన్‌లో పంపిణీ చేశారు.

కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరద ముంపులో ఉన్న బాధితులను ఆదుకోవడానికి తాడేపల్లిగూడెంలోని దాతలు ముందుకు రావాలని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారుచేసి పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి విజయవాడకు పంపించారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. వరద ముంపులో ఉన్న వారిని ఆదుకునేందుకు తాను సైతం సిద్ధంగా ఉన్నానని, తన వంతు సహకారాన్ని కూడా వరద బాధితులకు అందిస్తున్నట్లుగా తెలిపారు. స్థానిక భారతీయ విద్యా భవన్ ప్రాంగణం నుంచి సుమారు పది వాహనాల్లో ఆహార పొట్లాలను వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించారు.

భీమవరం టౌన్: మానవత దృక్పథంతో ప్రతిఒక్కరూ వరద సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం శ్రేయాస్ గ్రాండ్ ఇన్ హోటల్ డైరెక్టర్ యర్రా రాధాకృష్ణ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు 10 వేల పులిహోర ప్యాకెట్లు తరలింపు కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. భీమవరం నుంచి దాతలు ముందుకు రావడం ఎంతో గొప్ప విశేషమన్నారు. కార్యక్రమంలో మలిశెట్టి చినబాబు, సత్తిబాబు, పెన్మెత్స రమేష్‌రాజు, రాపర్తి మల్లి, నల్ల సత్యనారాయణ, చిన్నా, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, మంగదొడ్డి మహేంద్ర, చల్లా రాము, కొప్పినీడి బాబి పాల్గొన్నారు.

కాళ్ల: విజయవాడ వరద బాధితులకు కాళ్ల మండలం నుండి ఎనిమిది వేల బిర్యానీ ప్యాకెట్లను దాత గాదిరాజు సుబ్బరాజు ఆర్థిక సహకారంతో పంపినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ జి.చిట్టిబాబు, విఆర్ఎలు డేవిడ్, పవన్, అజయ్ పాల్గొన్నారు.

ఆకివీడు: కష్టాల్లో ఉన్న తోటి సోదరులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దీనికి ముందడుగు వేసిన ఆకివీడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అభినందనీయులని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆరు వేల ఆహార పొట్లాలను ప్రత్యేక వాహనం ద్వారా మంగళవారం తరలించారు. ఈ వాహనాన్ని ఎంఎల్‌ఎ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, కార్యదర్శి గుర్రం శ్రీనివాసు, టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, నేతలు గొకోట్ల శ్రీనివాస్, వెంకటరావు, గంధం ఉమాసత్యనారాయణ, గుంట్ల గణపతి, జంపన రాజబాబు, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రయివేట్ సంస్థలు ముందుకు రావాలని తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ కోరారు. వరద బాధితులను ఆదుకునేందుకు మేమున్నాం అంటూ ముందుకొచ్చిన పాలకొల్లులోని సంధ్య మెరైన్స్ వారిని ఆయన అభినందించారు. వారు 5 వేల ఆహార పొట్లాలతో వ్యాన్ ను తహశీల్దార్ నేతృత్వంలో వరద బాధితులకు మంగళవారం పంపించారు. విఆర్ఒ, ఫ్యాక్టరీ అకౌంటెంట్ రాంబాబు పాల్గొన్నారు.

ఉండి : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచనల మేరకు మండల తహశీల్దార్ నాగార్జున ఆధ్వర్యంలో 6000 ఆహార పొట్లాలను జిల్లా ఆక్వా ఎక్స్పోర్ట్ అసోసియేషన్ సహకారంతో రెవెన్యూ సిబ్బంది విజయవాడ తరలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగార్జున మాట్లాడుతూ విజయవాడ పరిసర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు వర్షాల వల్ల జలమయమయ్యాయి. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు తమ వంతు సహకారంగా ఆహార పొట్లాలు పంపిణీ చేసేందుకు రెవెన్యూ సిబ్బంది విజయవాడకు ఆహార పొట్లాలు తరలించినట్లు ఆయన తెలిపారు.

జ్వరాలపై సక్రమంగా సర్వే చేయాలి

డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్



అధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

లంకలకోడేరు పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయ పరిధిలో పిహెచ్‌సిలో నమోదవుతున్న జ్వర బాధితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశాలను జ్వరాలపై చేస్తున్న సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సందర్శించినప్పుడు జ్వర లక్షణాలు గల వారిని గుర్తించి వారికి ప్రాథమిక పరీక్షలు చేసి తక్షణం పిహెచ్‌సికి తరలించి వైద్యం అందించాలని తెలిపారు. గ్రామీణ స్థాయిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ వద్ద డెంగీ లక్షణాలు గల వారికి ఎంఎల్‌హెచ్‌పి ద్వారా పరీక్షలు చేసి పాజిటివ్ వస్తే మేక్ ఎలిసా పరీక్షకు తణుకు రిఫర్ చేయాలని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణస్థాయిలో వైరల్ జ్వరాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో ఇంటి ఆవాసాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్ పాల్గొన్నారు.

తెగుళ్లు సోకకుండా చర్యలు

ఉండి కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పంటలకు తెగుళ్లు సోకే అవకాశాలు ఉన్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు సూచించారు. మోగల్లు, గరగపర్రు గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను మంగళవారం భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ముంపునకు గురైన వరిచేలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పిచికారీ చేయాల్సిన మందుల గురించి అవగాహన కల్పించారు. వీరి వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సూర్యకృష్ణ, బిఎల్.స్వరూపరత్నం, రైతులు ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



కొలనపల్లిలో రోడ్డు మరమ్మతులు పనులు చేయిస్తున్న సర్పంచి


సర్పంచి చొరవతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కాళ్ల

కొలనపల్లి గ్రామంలో గోతులమయంగా ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మతు పనులు సర్పంచి కొనకంచి సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కొలనపల్లి గ్రామస్తులు కాళ్లలోని ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వాసుపత్రి, బ్యాంకులకు, నిత్యావసరాల నిమిత్తం వెళ్లాలన్నా ఈ రోడ్డు నుంచి వెళ్లాలి. అయితే రోడ్డు అధ్వానంగా ఉండడంతో వారు నానా అవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. గ్రామ సర్పంచి ప్రత్యేక దృష్టి సారించి రెండు రోజుల నుంచి రోడ్డును సరిచేసే గోతులేకుండా చదును చేస్తున్నారు. సుమారు 2కిలో మీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు వెళ్లేలా చేయడంతో పాటు రోడ్డు మరమ్మతులు చేశారు. ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా రెండు రోజులుగా పనులు చేస్తున్నామని సర్పంచి సూర్యనారాయణ వివరించారు.

సిపిఎం సీనియర్ నేత సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి - తణుకు




సత్యనారాయణ (ఫైల్‌ఫోటో)

ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామానికి చెందిన దొంగ సత్యనారాయణ సిపిఎం సభ్యులుగా 35 సంవత్సరాలుగా పార్టీలో ఉంటూ గ్రామశాఖ కార్యదర్శిగా, మండల కమిటీ సభ్యులుగా, గ్రామ పంచాయితీ ఉపసర్పంచిగా పనిచేశారని, ఆయన మంగళవారం ఉదయం ఆకస్మాత్తుగా మృతి చెందారని సిపిఎం ఇరగవరం మండల కన్వీనర్ కామన మునిస్వామి తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారన్నారు. ఆయన మృతి చెందే వరకూ పార్టీకి సేవలందించారని తెలిపారు. గ్రామంలో పార్టీ తరపున ప్రజలకు అనేక కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహించారని తెలిపారు. సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పివి.ప్రతాప్ సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి పిల్లి.కోటేశ్వరరావు, పార్టీ సభ్యులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ప్రేమే మార్గం సేవ లక్ష్యం అనే నినాదంతో ఆపదలో ఉన్న వృద్ధులను ఆదుకోవడానికి ట్రస్ట్ ముందుకొచ్చిందని ట్రస్ట్ ఛైర్మన్ నల్ల రాధాకృష్ణ అన్నారు. మంగళవారం వల్లూరులో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకు రెండు రోజులపాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రేమే మార్గం సేవ లక్ష్యం ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కుసుమే సత్యనారాయణ, చింతపర్తి రాజేష్, కాపవరపు రామకృష్ణ, అడపా హేమంత్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

22 నుంచి సిపిఎం రాష్ట్ర సమావేశాలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరగనున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అన్నారు. మంగళవారం పట్టణంలో ఆటో కార్మికులకు కరపత్రాలు పంచుతూ ఆ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు, త్రిమూర్తులు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన నరసాపురం పట్టణంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు మొదటిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. నిత్యావసరాల ధరలు, ప్రజల ఆదాయాలు తగ్గుదల, నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన విభజన చట్టం హామీల అమలు, పోలవరానికి నిధులు, ప్రత్యేక రైల్వేజోన్ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. సమావేశాల చివరి రోజు 24న బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, కోడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాళీపట్నం పడమరలో కచ్చా డ్రెయిన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - మొగల్తూరు

అంటువ్యాధులు ప్రబలకుండా కాళీపట్నం పడమరలో పారిశుధ్య నిర్వహణకు కచ్చా డ్రెవ్ ఏర్పాటు చేశామని సర్పంచి కౌరు సావిత్రి ఆదినారాయణ తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి ఇళ్ల మధ్య నిలిచిన నీటిని యంత్రాలతో తోడినట్లు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు శానిటేషన్ చేశామని పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ తెలిపారు.

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లో నేత్రదానంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ అంధత్వ నివారణా కార్యక్రమంలో భాగంగా ఆశా డే సందర్భంగా జరిగిన నేత్రదాన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు. నేత్రదానం అందరూ చేయొచ్చన్నారు. రక్తపోటు, మధుమేహం ఉన్నవారు కూడా చేయొచ్చన్నారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ ఉన్నవారు నేత్రదానం చేయకూడదన్నారు. ఈ నెల 7వ తేదీ వరకూ గ్రామాల్లో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

తణుకు రూరల్ :వైటాల్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు బాపతు చెన్నారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వైటాల్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బిఎం.గోపాల్ రెడ్డి తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులకు సైకిళ్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రాకపోకలకు ఉపయోగకరంగా ఉండేలా ఏటా విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖ అధికారి డి.మురళి సత్యనారాయణ, ఎంఇఒ వి.హైమావతి, తేతలి ప్రధానోపాధ్యాయులు కె.రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంజిన్లతో నీరు తొలగింపు

మొగల్తూరు:ఇటీవల కురిసిన అధిక వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో మొగల్తూరు పంచాయతీ పాలకవర్గ సభ్యులు సిబ్బంది మంగళవారం పర్యటించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గరువుపాలెంలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు బయటకెళ్లేలా యంత్రాలతో కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిలిచిన వర్షపు నీటిని ఇంజిన్ల సాయంతో బయటకు తోడారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉపసర్పంచి బోనం నరసింహారావు, పాలకవర్గ సభ్యులు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నీటిని క్లోరినేషన్ చేయాలి

ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాళ్ల

వర్షాల నేపథ్యంలో మండలంలోని 21 గ్రామాల్లో రక్షిత నీటి పథకాలను క్లోరినేషన్ చేసి శుభ్రంగా ఉంచాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తానింకి శ్రీనివాసరావు గ్రామ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం పెదఅమిరం గ్రామంలో రక్షిత తాగునీటి పథకాన్ని ఆయన పరిశీలించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విషజ్వరాలు, దగ్గు మొదలకు సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామ పంచాయితీలో ఇంటింటికీ పంపిణీ చేసే నీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటి కాలుష్యాన్ని తనిఖీ చేయడానికి టిడిఎస్ పరికరంతో గ్రామ పంచాయతీలో నీటిని పరీక్షిస్తే టిడిఎస్ మీటర్‌లో 250 ఎంజి మినరల్ ఉందని, ఆ నీరు తాగడానికి అనుకూలంగా ఉందన్నారు. ప్రయివేటు ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ నీటిని తనిఖీ చేస్తే 84 ఎంజి మినరల్ ఉన్నట్లు ఉందని ఈ నీరు సురక్షితం కాదని తెలిపారు. మంచినీటి పథకాల్లో వర్షపు నీరు, బురద చేరకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సర్పంచి దొమ్మ సోమేశ్వరరావు ఇంటింటికీ సురక్షిత నీటి పంపిణీలో ఎంత మోతాదులో క్లోరినేషన్ చేస్తున్నారని, ఏవిధమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారని తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు షాకెద్, వంశీకృష్ణ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టైలర్లకు పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి - తణుకు

50 ఏళ్లు నిండిన ప్రతి టైలర్‌కూ సామాజిక సంక్షేమ వృద్ధాప్య పింఛను అమలు చేయాలని వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేవారు. మంగళవారం వేల్పూరులోని స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో టైలర్స్ వర్కర్స్ సంఘం సమావేశం మల్లేశ్వరపు నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ సమాజంలో మానవుని హుందాతనాన్ని మరింత మెరుగుపర్చడంలో టైలరింగ్ వృత్తి కీలకమైందన్నారు. అటువంటి టైలరింగ్ వృత్తి నేటికీ ప్రభుత్వం గుర్తింపునకు నోచుకోవడం లేదన్నారు. టైలర్లకు ఓవైపు ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం లేకపోవడం, మరోవైపు రెడీమెడ్ దుస్తులు విచ్చలవిడిగా మార్కెట్లో తక్కువ ధరలకు లభించడంతో లక్షల మంది టైలర్ల జీవన పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన చేదోడు పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. ఏటా టైలర్లకు రూ.10 వేలు చొప్పున మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకం కింద ప్రతి వృత్తిదారుడుకీ 50 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, తాడిశెట్టి కోట వెంకటేశ్వరరావు, కరెళ్ల రాంబాబు, రుద్రాక్షుల శ్రీనివాసు, నందం శ్రీరాములు, విశ్వనాథం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఉండి

శత వసంతాల చరిత్ర కలిగిన ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్ది విద్యార్థులకు అన్ని వసతులూ గురుపూజోత్సవం నాటికి కల్పించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. మంగళవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన నాగరాజు మాట్లాడుతూ ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు దాతల సహకారంతో టిడిపి సీనియర్ నాయకులు మంతెన సాయి లచ్చిరాజు, ముదునూరి కృష్ణంరాజు ఆధ్వర్యంలో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆహ్లాదాన్ని, స్వచ్ఛమైన గాలిని ఇచ్చేందుకు మొక్కలు నాటినట్లు తెలిపారు. వర్షాల వల్ల క్రీడా మైదానం పూడిక కొంతమేర నిలిచిపోయిందని, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో క్రీడ మైదానం పూడిక జరుగుతుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గొట్టుముక్కల శ్యాం ప్రసాద్‌రాజు, ఇందుకూరి గజపతిరాజు, ముదునూరి రవివర్మ, ముదునూరి హరికృష్ణంరాజు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ తదితరులను మండల అధ్యక్షులు నాగరాజు, గ్రామాధ్యక్షులు కాగిత బుజ్జి అభినందించారు.

త్వరలో పూర్తిస్థాయిలో ఉప్పుటేరు ప్రక్షాళన

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

కొల్లేటి అనుసంధానంగా ఉన్న ఉప్పుటేరును త్వరలో పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపట్టాల్సి ఉందని, ఈ మేరకు విషయాన్ని ముఖ్యమంత్రికి నివేదిస్తామని ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు అన్నారు. అంతవరకూ తాత్కాలికంగా పనులు ప్రారంభించామన్నారు. ఈ పనులను డ్రెయినేజీ డిపార్ట్మెంట్ జిల్లా, మండలస్థాయి అధికారులతో, ఇంజినీర్లతో కలిసి ఆయన మంగళవారం ఉప్పుటేరుపై ఉన్న రైల్వే వంతెన వద్ద పరిశీలించారు. ఉప్పుటేరు ఎగువ 22 లక్షల ఎకరాల పంట మురుగు నీటిని సముద్రంలోకి చేర్చే ముఖ్యమైన మార్గం ఉప్పుటేరని ఎమ్మెల్యే తెలిపారు. ఆ నీటి ప్రవాహం ఆగిపోతే చాలా ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రస్తుతం ఎగువ నీటి ప్రవాహం గుర్రపుడెక్క వల్ల ఆగిపోయిందు వల్ల తాత్కాలికంగా కొంతమేర తొలగించే ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. అయితే పూర్తిస్థాయిలో ఉప్పుటేరులో తూడు, కిక్కిస 60 నుండి 70 కిలోమీటర్ల మేర విస్తరించిందన్నారు. అంతా తొలగించాల్సి ఉందన్నారు. దీనికి రూ.40 కోట్లకుపైగా వ్యయం కావొచ్చని తెలిపారు. ప్రస్తుతం నీటి ప్రవాహానికి అడ్డం లేకుండా పనులు సాగుతున్నాయన్నారు.



కిక్కిసను పరిశీలిస్తున్న రఘురామకృష్ణంరాజు



మొగల్తూరు : ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సమతుల్య ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం పౌష్టికాహారంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జి.వెంకటేశ్వర్లు, పిహెచ్‌ఎన్‌వి అన్నకుమారి, ఎహెచ్ విటి.సుబ్బలక్ష్మి, ఆరోగ్య సహాయకులు నామాలరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : పౌష్టికాహారం తీసుకోవడంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహనా ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో పిహెచ్‌సి డాక్టర్ లక్ష్మీపార్వతి, సిహెచ్‌ఒ వై.విజయలక్ష్మి, డిఇఒ రమేష్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహనుండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విష్ణు కళాశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ చూపు లేకపోవడం ఎంతో ఇబ్బందికరమైన పరిస్థితి అన్నారు. నేత్రదానంతో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. చనిపోయిన వారి రెటీనా దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపు అందించవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. అంధత్వ నివారణ కోసం పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలు సదస్సులు నిర్వహించి నేత్రదానంపై అవగాహన కలిగించాలని, అంధత్వ నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరణానంతరం 6 గంటలలోపు నేత్రాలను సేకరించి కంటి చూపు లేని ఇద్దరికి చూపు కలిగించి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన వారు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ లయన్స్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, భీమవరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పిజె.మూర్తిరాజు పాల్గొన్నారు.

హరిశ్చంద్ర ప్రసాద్‌కు నివాళి

తణుకు:ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ తణుకు ప్రాంత అభివృద్ధికి, వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేస్తూ ఎన్నో పరిశ్రమలు స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పించిన మహనీయుడని టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ కొనియాడారు. మంగళవారం డా.ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ 13వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలగర వెంకటకృష్ణ, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దొమ్మేటి వెంకటసుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం మాట్లాడుతూ చక్కెర పరిశ్రమ నుంచి రాకెట్ ఇంధనం వరకూ ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు తణుకు ప్రాంతాన్ని సొంత వనరులు సమకూర్చే విధంగా తణుకు పురపాలక సంఘాన్ని ఆధునికీకరించడంలో రూపశిల్పిగా హరిచంద్రప్రసాద్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి తమరాపు రమణమ్మ, చిట్టూరి సాయిబాబా, నల్ల భాస్కరరావు, ఒమ్మి రాంబాబు, తాతిపూడి మారుతీరావు, గుబ్బల శ్రీనివాస్, చదలవాడ నాని పాల్గొన్నారు.

'నరసాపురం'లోనే మత్స్య కళాశాల

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రాంతంలోనే మత్స్య కళాశాల కొనసాగుతుందని, వేరే ప్రాంతానికి తరలివెళ్తుందని పుకార్లు వస్తున్నాయని, అందులో వాస్తవం లేదని మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ టి.నీరజ అన్నారు. మంగళవారం లక్ష్మణేశ్వరంలోని మత్స్య కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీరజ మాట్లాడారు. 2023- 2024 విద్యా సంవత్సరం బిఎఫ్‌సి కోర్సుకు సంబంధించి 62 మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్ ప్రారంభమైందన్నారు. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీ వరకూ మొదటి కౌన్సెలింగ్ జరుగుతోందన్నారు. ఈ ఏడాది 60 సీట్లతో పాటు మరో 2 సీట్లు ఇడబ్ల్యూసి ద్వారా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఆధీనంలో ఈ మత్స్య కళాశాల ఉంటుందని తెలిపారు. ఎపి ఇఎపి సెట్ పరీక్ష ద్వారా బైపిసి చదివిన విద్యార్థులు బిఎఫ్‌సి కోర్సు అభ్యసించవచ్చని తెలిపారు. మార్కులను బట్టి, ర్యాంకులను బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ కౌన్సిలింగ్ జరుగుతుందని అన్నారు. ఈ కోర్సు ద్వారా ఎంతోమంది ఉన్నత ఉద్యోగావకాశాలు పొందారన్నారు. సమావేశంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ వీరభద్రరావు ఉన్నారు.

తాగునీటి చెరువు పరిశీలన

నరసాపురం:పురపాలక సంఘం పరిధిలోని 2వ వార్డులో ప్రధాన రక్షిత తాగునీటి చెరువును మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఆలమ్, క్లోరిన్ సిలిండర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం 23వ వార్డులోని రామాలయం వీధి వద్ద శానిటేషన్‌ను పరిశీలించి పిచ్చి మొక్కలు, దోమలు బెడద లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు సోమరాజు దుర్గాభవాని, మల్లాడి బుజ్జి, కావలి నాని, గోరు సత్తబాబు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం జెఎసి విరాళం


పెనుమంట్ర:జెఎసి పక్షాన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ అందరి జీతాల్లో ఒకరోజు బేసిక్ వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇవ్వడానికి ఎపి జెఎసి తరపున నేడు నిర్ణయం తీసుకున్నారని యుటిఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆయా ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల జీతం, పెన్షన్ నుంచి ఒక రోజు బేసిక్ వేతనం విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

పొలాల్లో నీటిని బయటకు తోడేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

పంట చేలల్లో నీటిని వెంటనే బయటకు తోడేయాలని, బయట పిల్ల కాలువలు పొంగితే ఆ నీరు లోపలికి రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్టలు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఉప్పుటేరులో నీటి ప్రవాహ పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఉప్పుటేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైల్వే అధికారులతో కూడా మాట్లాడతామన్నారు. అనంతరం అక్కడ ఉన్న వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం ఉప్పుటేరుపై ఆగిపోయిన బైపాస్ రోడ్డు ప్రతిపాదిత వంతెనను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, ఎండిఒ శ్రీవాణి, వ్యవసాయ శాఖ ఎడి కెఎఎస్ ఎస్.శ్రీనివాసరావు, ఎఒ ప్రియాంక, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం :మండలంలో వీరవాసరం, బాలేపల్లి, మత్స్యపురి, బొబ్బనపల్లి, మెంటేపూడి గ్రామాల్లో అధిక వర్షం కారణంగా ముంపునకు గురైన వరి నారుమడులను, పొలాలను భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాస్, స్థానిక మండల వ్యవసాయ అధికారి బిన్నీ బాబుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ముంపునకు గురైన నారుమడులు, వరి పొలాలకు చెందిన రైతులందరూ మడి లేదా పొలంలో ఉన్న నీటిని బయటకు పోయే విధంగా బాటలు తీసుకోవాలని చూడాలని సూచించారు. నారుమడిలో నీరు బయటకు తీసిన తరువాత కార్బెండిజం 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నారుమడికి చుట్టూ బోదెలు తీసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



వీరవాసరం : పొలాలను పరిశీలిస్తున్న భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్

నరసాపురం:మండలం'లోని రుస్తుంబాద పంచాయితీలో, పలు ప్రాంతాలలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వరి చేలను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.షరీఫ్ స్థానిక టిడిపి నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

దుంపగడపలో రక్త పరీక్షలు

ఆకివీడు:దుంపగడపలో మంగళవారం జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరం ప్రభావంతో ఇటీవల ఓ బాలిక మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై రెండు రోజుల క్రితం పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ నాగరాణి తక్షణం రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేకంగా తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రి డాక్టర్ శృతిని నియమించారు. మొత్తం 26 మంది రక్తం సేకరించి పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ భువన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యాన ధర్నా

భీమవరం టౌన్:ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, తక్షణం నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శ్రేణులు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ ధరలను తగ్గించలేని పాలకులకు పాలించే అర్హత లేదని విమర్శించారు. సిపిఐ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఎస్ఎస్‌వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, వైవి.ఆనంద్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తహశీల్దార్ సాయికృష్ణకు సిపిఐ నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఆరేటి మృత్యుంజయ మాట్లాడుతూ అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నెక్కంటి క్రాంతికుమార్, దొంగ పూర్ణ చంద్రరావు, నాగళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై దాడి

ఉండి:కోలమూరు గ్రామంలోని పేకాట స్థావరంపై మంగళవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,650 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నరసాపురం:మహిళలకు సంక్రమించే రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం ఈ నెల 4న నిర్వహించనున్నట్లు గైనకాలజిస్టుల సంఘ జిల్లా అధ్యక్షురాలు పద్మావతి తెలిపారు. 30 నుంచి 70 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 08814 276667 నంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 25/2022 in
O.S. No. 188/2015

Between:
DHR/ వాది: ముత్యాల ఏడుకొండలు
JDR/ ప్రతివాది:
చామర్తి కోదండరామ కనకదుర్గ వరప్రసాద్ గుప్త
JDR/ ప్రతివాది:
చామర్తి కోదండరామ కనకదుర్గ వరప్రసాద్ గుప్త, S/o. అప్పన్న శాస్త్రి, డో.నెం. 3-133, యండగండి, ఉండి మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను, వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు **ది. 20-09-2024 సం॥రం తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు** స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

కె.వి.రమేష్
భీమవరం　　వాది తరపు న్యాయవాది
02-09-2024　　పెన్నాడ

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM
IA 399/2023 in O.S. 49 /2023

Between:-
Karri Jagadeesawarao S/o Appalaswamy, aged 29- resident of Reddypeta village,Vadada post, Srikakulam District.
...Petitioner/ Plaintiff

And:-
Karri Sai Reddy @ Sai Chandra Reddy, S/o Ramakrishna Reddy, aged about 32 years, residing at door no 13-165, velagalavaripalem village, Penumantra mandal, parchima Godavari District ...Respondents/Defendants

NOTICE

It is informed that the above matter I A 399/2023 in O.S. 49 /2023on the file of HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM. Is stands posted on **09-09-2024** for appearance of defendant and you are to appear on afore said date before the HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM about at 10.30 AM, in person or through pleader other wise the above matter will decide against you. Hence this notice.

CHITTI SURYANARAYANA
ADVOCATES FOR PETITIONER,
SRIKAKULAM,
Cell: 9866101020, 9963699223.